వేసవి దుక్కులతో రైతన్న బిజీ

• వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న అన్నదాతలు
• మొక్కజొన్న, మినుము, మెట్టవరి పంటలు వేసేందుకు వ్యవసాయ పనులు

ఆశల సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ సమీపిస్తుండటంతో దుక్కుల పనుల్లో రైతన్నలు బిజీగా ఉన్నారు. ఇటీవల కురిసి వర్షాల నేపథ్యంలో వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. కూలీలతో చెత్తాచెదారం, కంప చెట్లు, పంటల వ్యర్థాలను తొలగించడం.. పశువుల ఎరువులను పొలంలో వేసి యంత్రాలతో కలియ దున్నడం, గొర్రు కొట్టి చదును చేయడం తదితర పనుల్లో డివిజన్ రైతులు నిమగ్నమయ్యారు. జూన్‌లో వచ్చే మృగశిరకార్తెలో విస్తారంగా వర్షాలు పడితే రైతులు విత్తు వేసేందుక సిద్ధమవుతున్నారు. – ఆత్మకూరు


సేద్యం పనుల్లో నిమగ్నమైన రైతన్నలు


ట్రాక్టర్‌తో పొలంలో దుక్కుదున్నుతున్న రైతులు

వేసవి దుక్కుల అనంతరం రైతులు పొలాల్లో విత్తువేసేందుకు సిద్ధమవుతున్నారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా మొక్కజొన్న పంట సాగు చేశారు. ప్రస్తుతం ఈ ఏడాది కూడా మొక్కజొన్న పంటను అత్యధికంగా వేసేందుకు రైతులు ప్రణాళికలను రూపొందించుకుంటున్నారు. మొక్కజొన్నతో పాటూ పెసర, మినుము, పత్తి, పట్టు, కొర్ర, కంది పంటలు సైతం సాగుచేయనున్నారు. ఆత్మకూరు మండలంలో ఏటా 3,205 ఎకరాల్లో మొక్కజొన్న సాధారణంగా సాగు చేయాల్సి ఉండగా గత ఏడాది అత్యధికంగా 4,910.5 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది 5 వేల ఎకరాలకు పైగానే సాగు చేయనున్నారు.

ఆత్మకూరు డివిజన్ పరిధిలో 10,229 ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేయాల్సి ఉంది. అయితే రికార్డు స్థాయిలో గత ఏడాది 17,186 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న పంటను పండించారు. ఈ ఏడాది కరీఫ్‌లో 18 వేల ఎకరాలకు పైగానే మొక్కజొన్న పంట రైతులు వేయనున్నారు. మెట్టవరి ఆత్మకూరు మండలంలో 2,324 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 2,191 ఎకరాల్లో మాత్రమే గత ఏడాది రైతులు సాగు చేశారు. మినుము డివిజన్ వ్యాప్తంగా 772 ఎకరాల్లో సాధారణ సాగు చేయాల్సి ఉండగా కేవలం 304 ఎకరాల్లో మాత్రమే సాగైంది.

వేసవి దుక్కులు ఎంతో ఉపయోగం

ఖరీఫ్‌కు సిద్ధమయ్యే రైతులు విత్తనానికి ముందే వేసవిదుక్కులు దున్నడం ఎంతో ఉపయోగకరం. వేసవి దుక్కుల వల్ల తెగుళ్లను వ్యాప్తిని చేసే క్రిమికీటకాలు నశిస్తాయి. అధిక దిగుబడులు చేతి కందుతాయి.

– విష్ణువర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, ఆత్మకూరు

శనగల బసవన్నకు పూజలు


క్షేత్రపాలకుడు బయలువీరభద్రస్వామి


శనగల బసవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని స్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్ర పాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడు వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. తరువాత నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

క్లుప్తంగా

కుమారస్వామికి పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

బదిలీ ఎస్‌ఐకి సన్మానం


ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం

పగిడ్యాల: ముచ్చుమర్రి స్టేషన్‌లో పనిచేస్తూ నాగలాపురం స్టేషన్‌కు బదిలీపై వెళ్తున్న ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డిని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ఘనంగా సన్మానించారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమన్నారు. ఎక్కడ పనిచేసిన మంచి సేవలందించి ప్రజల నుంచి గుర్తింపు పొందాలని సూచించారు. అనంతరం ఎస్‌ఐని శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మిడుతూరు, బ్రాహ్మణకొట్కూరు, నందికొట్కూరు, జూపాడుబంగ్లా ఎస్‌ఐలు ఓబులేసు, తిరుపాలు, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, ఏఎస్‌ఐ శేషయ్య, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు


సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు

నందికొట్కూరు: వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేస్తే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని కొణిదేల జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రామచంద్ర మూర్తి, గవర్నమెంట్ హైస్కూల్ హెచ్‌ఎం రామిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయా హైస్కూల్‌లో ఒకేషనల్ ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు హెచ్‌ఎంలు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కొణిదేల జెడ్పీ హైస్కూల్‌లో వేసవి కాలంలో మహిళలకు కుట్టు శిక్షణ, క్రీడాకారులకు కబడ్డీ, వాలీబాల్‌లలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పీడీ రవికుమార్ తెలిపారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

లెనిన్‌కు నివాళి


లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: లెనిన్ జయంతిని మంగళవారం స్థానిక ధనుంజయ సమావేశ భవనంలో సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నరసింహ నాయక్, కొత్తపల్లి మండల కార్యదర్శి స్వాములు మాట్లాడుతూ దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజాతంత్ర్య హక్కుల కోసం లెనిన్ పోరాడతారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమాలు చేయాలని కార్యకర్తలకు సూచించారు.

ఊయల విరాళం


ఊయల అందజేసిన రత్నం ఫౌండేషన్ నిర్వాహకులు

నందికొట్కూరు: పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో(సంతపేట) విద్యార్థుల సౌకర్యార్థం రత్నం ఫౌండేషన్ నిర్వాహకులు ఊయ్యాలను విరాళమిచ్చారు. రూ.15 వేల విలువ చేసే ఊయలను రిటైర్డ్ టీచర్ కరుణ తర్నమ్మ, రాజారత్నం పేరుతో మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చిప్పగిరి నారాయణస్వామి, ఉపాధ్యాయురాలు జయమ్మ, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ వాయిదా

పాములపాడు: వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం నుంచి నిర్వహించాల్సిన శిక్షణా తరగతులను వాయిదా వేసినట్లు తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని, తదుపరి తేదీని ప్రకటిస్తామని వివరించారు.

ఉపాధి కూలీలకు టెంట్‌లను ఏర్పాటు చేయాలి


కూలీలతో మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహనాయక్

ఆత్మకూరు: ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో టెంట్లను ఏర్పాటు చేసి నీడను కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం వడ్ల రామాపురం గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యాయన్నారు. మంచినీరు, టెంటు, మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్స్, గడ్డపార, పికాసి, చలిక ఇవ్వడంతో పాటు వంద రోజులు పని దినాలు కల్పించాలన్నారు. 15 రోజులకోసారి బిల్లులు ఇవ్వాలన్నారు. 9 వారాల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

వరికి మద్దతు ధర కల్పించాలి


వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

బండి ఆత్మకూరు: వరి ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు డేవిడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని రామాపురం గ్రామాన్ని సందర్శించి, వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యానికి ధర గిట్టుబాటు కాకపోవడంతో అప్పులపాలవుతున్నారన్నారు. దళారులు 78కిలోల బస్తాను రూ.1,300 లకు మించి కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి మద్దతు ధర ప్రకటించి, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేవారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజు పాల్గొన్నారు.

మే డేను జయప్రదం చేయండి


వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

నందికొట్కూరు: మే డేను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్ కార్మికులకు సూచించారు. మంగళవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మే డే వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం తగదన్నారు. వాటిని రద్దు చేసి గత కార్మిక చట్టాల్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ డైలీవేజ్ కార్మికులను అప్కాస్‌లోకి తీసుకోవాలని, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు గోవింద్, అశోక్, తిక్కయ్య, ఉస్మాన్, శ్రీను పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించండి

పాములపాడు: ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి రైతులను ప్రోత్సహించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్, ఉద్యానశాఖ అధికారి హరిచందన అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పండ్ల తోటల పెంపకంపై కన్వర్జెన్స్ డిపార్ట్‌మెంటు సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

ఘనంగా లెనిన్ జయంతి

నందికొట్కూరు: కామ్రెడ్ లెనిన్ జయంతిని సీపీఐ(ఎంఎల్), సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్, ఎంసీపీఐయూ నాయకులు వెంకటేశ్వర్లు, లాజరస్, అర్లప్ప ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు నాయకులు నాగేశ్వరరావు, ఏసన్న, సోమన్న, నరసింహులు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కొలనుభారతి క్షేత్ర అభివృద్ధికి సహకరించండి

కొత్తపల్లి: కొలనుభారతీదేవి అభివృద్ధికి కృషి చేయాలని కాకనూరు శారద పీఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియాను కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొలను భారతీ దేవి క్షేత్రం అభివృద్ధి మధ్యలోనే ఆగిపోవడం బాధాకరమని, ప్రభుత్వం పరంగా ప్రత్యేక దృష్టి సారించి ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్‌ను కోరారు.

తాగు నీటిని వెంట తెచ్చుకోండి

పాములపాడు: ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉపాధి కూలీలు పనికి వెళ్లే సమయంలో 2 లీటర్ల తాగు నీటిని వెంట ఉంచుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం మండలంలోని యర్రగూడూరు గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. కూలీల మస్టర్ పరిశీలించారు. రూ.307 వచ్చేలా కొలతలు ఇవ్వాలని టీఏ, ఎఫ్ఏలకు ఆయన సూచించారు. ఆయన వెంట ఏపీఓ అలివేలిమంగమ్మ ఉన్నారు.

ఇరువర్గాల ఘర్షణ


పొలంలో ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మాపురం అంచె సమీపంలో ఉన్న ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడ్డారు. పగిడ్యాలకు చెందిన పగడం శేషన్న, కాటేపోగు సురేష్ వర్గాల మధ్య కొంత కాలంగా పొలం వివాదం ఉంది. కాటేపోగు సురేష్ అక్రమంగా తమ పొలాన్ని ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని పగడం శేషన్న సోదరులు కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారు. ఉదయం పొలానికి వెళ్లి ట్రాక్టర్‌తో సేద్యం చేసేందుకు ప్రయత్నించగా కాటేపోగు సురేష్ సోదరులు, కుటుంబీకులు అడ్డుకొని గొడవకు దిగారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుని పరస్పరం కర్రలతో దాడులకు పాల్పడ్డారు. ఇరువర్గాల్లోని పలువురికి గాయాలయ్యాయి. స్టేషన్‌కు చేరుకుని పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ విషయంపై నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా దాడులకు పాల్పడినది వాస్తవమేనని విచారించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

మహానందిలో 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు

మహానంది: భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. ఉదయం పది దాటక ముందే తన ప్రతాపం చూపుతున్నాడు. మహానంది మండలంలో మంగళవారం 43 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో భక్తులతో కళకళలాడే మహానంది ఆలయ ప్రాంగణాలు వెలవెలబోయి.

వ్యక్తి దుర్మరణం

బండి ఆత్మకూరు: కడమల కాలువ గ్రామానికి చెందిన కలసపాటి పెద్ద వెంకట స్వామి (42) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు.. మంగళవారం అడవికి వంట చెరుకు తెచ్చుకునేందుకు ఆటోలో వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో జమాలయ్య దర్గా వద్దకు చేరుకోగానే ఆటో అదుపు తప్పి చెట్టుకు ఢీకొంది. ఆటో కేబిన్‌లో ఇరుక్కుని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతునికి భార్య జయమ్మ ఉంది. సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి


పశువైద్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కరుణాకర్

మహానంది: పాడిపశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ కరుణాకర్ సూచించారు. మహానంది వ్యవసాయ కళాశాల ఎస్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం తమ్మడపల్లెలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. అంతకు ముందు మహానంది పోలీసులు సైబర్ నేరాలు, శక్తియాప్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓలు డాక్టర్ మాధవి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, వీఎల్‌ఓ సులోచన పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

నందికొట్కూరు: మిడుతూరు మండల పరిధిలోని తలముడిపి గ్రామానికి చెందిన బోయ మబ్బు రంగస్వామి కుమారుడు రవికుమార్(25) మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మిడుతూరు ఎస్‌ఐ ఓబులేసు తెలిపిన వివరాలు.. చిన్నతనం నుంచి మానసిక స్థితి సరిగా లేక ఉరేసుకున్నట్లు తల్లిదండ్రులు, గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


విద్యార్థులతో ఎంఈఓలు, హెచ్‌ఎంలు

పగిడ్యాల: మండలంలోని కొత్త పాలమర్రి ఎంపీపీ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి హాజరై పూర్తయిన తరగతుల పట్టాలను విద్యార్థులకు అందజేసి పైరగతులకు ప్రమోట్ చేసి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వినీల, జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

శ్రీమద్రామాయణం సంస్కృతిలో భాగం


ధార్మిక ప్రవచనం చెబుతున్న ధర్మ ప్రచార మండలి సభ్యులు మల్లు వెంకటరెడ్డి

నందికొట్కూరు: శ్రీమద్రామాయణం కేవలం ఒక ఇతిహాస గ్రంథం మాత్రమే కాదని సామాజిక, రాజకీయ, సాంస్కృతిక గ్రంథమని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టరు మల్లు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం కోటవీధిలో వీరభద్రస్వామి దేవాలయంలో ధార్మిక కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి ప్రపంచంలోని అన్ని వర్గాల ప్రజలను ప్రభావితం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ధర్మ ప్రచార మండలి సభ్యులు నాగేశ్వర రెడ్డి, శివశంకర్‌రెడ్డి, గురు బసయ్య, మంజునాథ పాల్గొన్నారు.

నాణ్యత తేలిపోయింది

• చిన్నపాటి గాలివానకు ఛిద్రమైన అంగన్‌వాడీ లెట్రిన్


లేచిపోయిన రేకులు


టాయ్‌లెట్ గోడ ఇటుకలు కూలిన దృశ్యం

జూపాడుబంగ్లా: నాలుగు మాసాల క్రితం మండలంలోని తరిగోపుల మూడో అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిర్మించిన లెట్రిన్ చిన్నపాటి గాలివానకు ఛిద్రమైపోయింది. రూ.75 వేలతో చిన్నారులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయా సౌకర్యార్థం టాయ్‌లెట్‌ను నిర్మించారు. పైభాగంలో రేకులు వేసి మమ అనిపించారు. రెండు రోజుల క్రితం వీచిన ఈదురుగాలులు, వర్షానికి రేకులు లేచిపోయి ఇటుకలు కూలిపోవటంతో టాయ్‌లెట్ ఛిద్రమైపోయింది. నాణ్యతకు తిలోదకాలిచ్చి నిర్మించిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన జలం


మినిరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న బిషప్

నందికొట్కూరు: ప్రజలకు స్వచ్ఛమైన జలం అందించడమే తమ ధ్యేయమని కర్నూలు మేత్రాసన బిషప్ రెవరెండ్ డాక్టర్ గోరంట్ల జోహాన్స్ తెలిపారు. మంగళవారం మిడుతూరు మండలం ఉప్పలడియా విచారణలో మినిరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

బెల్లం ఊట ధ్వంసం

నందికొట్కూరు: మండల పరిధిలోని కోళ్లబావాపురం గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో నాటు సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊటను స్పెషల్ టీమ్ ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐ, పోలీసులు ధ్వంసం చేశారు. అనంతరం కోళ్లబావాపురం గ్రామంలో 2.0 నవోదయ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా నాటు సారా తయారు చేయడం నేరమన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా, ఇతర ప్రాంతాలకు తరలించినా క్రిమినల్ కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేసి జైల్‌కు పంపుతామన్నారు. దాడుల్లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్‌ఐలు జవ్రుల్లా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తాటి ముంజలు.. చల్లదనానికి సూచికలు!

• వడదెబ్బ తగలకుండా రక్షణ
• కేన్సర్‌ను దూరం చేసే శక్తి పుష్కలం
• మార్కాపురం నుంచి తెచ్చి విక్రయిస్తున్న వ్యాపారులు


తాటి ముంజలను అమ్ముతున్న వ్యాపారి

నందికొట్కూరు: ఐస్ యాపిల్‌గా పిలిచే తాటి ముంజలకు భలే గిరాకీ ఉంది. ఏటా ఎండాకాలంలో తాటి ముంజలతో ప్రజలు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు ప్రకాశం జిల్లా మార్కాపురం ఏరియా నుంచి తీసుకొచ్చి నందికొట్కూరులో విక్రయిస్తూ ప్రజలకు చల్లదనాన్ని ఇస్తున్నారు. పట్టణంలోని పెంట్రోల్ బంకు, పగిడ్యాల రోడ్డులోని పాత బస్టాండ్, అల్లూరు రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలో డజను రూ.100కు పైగా తాటి ముంజలను విక్రయిస్తున్నారు.

ముంజల వల్ల ఉపయోగాలు

- వేసవిలో వడదెబ్బ తగలకుండా ముంజలు చలువ చేస్తాయి.
- నీటి శాతం అధికంగా ఉండటం వల్ల శరీరానికి కావాల్సిన మినరల్స్, చక్కెరలను ముంజలు సమతుల్యం చేస్తాయి.
- జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం, ఎసిడిటి లాంటి ఆరోగ్య సమస్యలను దూరం చేస్తాయి. బరువును తగ్గిస్తాయి.
- తాటి ముంజలలో శరీరానికి కావాల్సిన విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. అధిక మొత్తంలో నీరుండటం వల్ల శరీర బరువు తగ్గిస్తాయి.
- తాటి ముంజలు కాలేయ సంబంధ సమస్యలను తగ్గిస్తాయి. వీటిలో ఉండే అధిక మొత్తంలోని పొటాషియం శరీరంలో ఉండే విష పదార్థాలను తొలగిస్తుంది. ముంజలను తినడం వల్ల వాంతులను అరికట్టవచ్చు.
- ఇవి కేన్సర్లను దూరం చేస్తాయి.
- తాటి ముంజలను పొట్టు తీయకుండా తింటే పై పొరలో ఎన్నో రకాల పోషక విలువలు ఉంటాయి.

రోజుకు రూ.వెయ్యి ఆదాయం వస్తోంది



రోజుకు 360 ముంజలు విక్రయిస్తున్నాం. ఆదాయం దాదాపు రూ.వెయ్యి దాకా వస్తోంది. 60 నుంచి 100 తాటి చెట్లను రూ.50 వేలకు కొనుగోలు చేస్తాం. తాటి చెట్ల మీద నుంచి గెలల్ని నరికి వాహనాల్లో నందికొట్కూరు తీసుకొచ్చి అమ్ముతున్నాం. వేసవిలో దాహాన్ని తీర్చుకునేందుకు ఇవి ఎంతో మేలు. మా రవాణా ఖర్చులు పోనూ రోజుకు కూలీ గిట్టుబాటు అవుతుంది.

– శివకుమార్ మార్కాపురం, వ్యాపారి